క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీఆర్వో సిద్దార్థ

కడెం: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కడెం ఆటవీ రేంజ్ అధికారి గీతరాణి అన్నారు. వన్యప్రాణి సప్తహ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాండ్వపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దార్థ వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఆర్వో ప్రకాశ్, కింగ్ ఫిషర్, వసంత్, రవి, నుమానుద్దీన్, జిజీయా తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన రొడ్డ చందు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి బ్యాచ్ 2007-08 మిత్రులు అతని కుటుంబానికి చేయూతనందించారు. రూ.25 వేలు జమ చేసి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు

సారంగపూర్: మండలంలోని నాగాపూర్‌తండా వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తమ సమస్యను మాజీ ప్రజా ప్రతినిధి జాదవ్ సురేష్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో దాదాపు 10 ట్రిప్పుల మొరం వేయించి గుంతలు పూడ్చివేయించారు. సురేష్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చిమొక్కల తొలగింపు



తొలగిస్తున్న ఎస్సై, సిబ్బంది

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలోని మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎస్సై పి.సాయికిరణ్ సిబ్బందితో కలిసి సోమవారం పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఎస్పీ జానకీ షర్మిల వారిని అభినందించారు. ప్రమాదాల నివారణకు పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

దస్తురాబాద్: మండల నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కోల మహేశ్, పూర్ణచందర్, అధ్యక్షుడిగా నేరెళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా శేఖర్, సభ్యులుగా శ్రీనివాస్, రాకేశ్, మధు, మునిందర్, చందర్, హరీశ్ ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

కుంటాల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. మండలంలోని విఠాపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సోన్: న్యూబొప్పారం గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్యాషియర్‌గా సొన్న శ్రీనివాస్, రైటర్‌గా, ఓజ స్వామి, కార్యవర్గ సభ్యులుగా దేశెట్టి నవీన్, కలిగోట్ నవీన్, తోట ప్రతాప్, పెద్దోళ్ల నరేశ్, మామూళ్ళ రాజు, రాచర్ల మహేశ్, రాచర్ల మల్లేశ్, దేశెట్టి సురేశ్ ఎన్నికయ్యారు.

పిచ్చికుక్కల దాడి ఒకరికి గాయాలు

బాసర: బాసరలో అల్లి అబ్దుల్లా అనే బాలుడిపై పిచ్చికుక్కల దాడి ఘటన మరువకముందే సోమవారం కొక్కుల రాజుపై దాడి చేశాయి. స్థానికులు గమనించి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందజేశారు. కాలనీల్లో కుక్కల బెడద నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కజొన్న కోతలు షురూ



నగర్‌తండా సమీపంలోని రోడ్డుపై మక్కలు ఆరబెడుతున్న రైతు

- బిజీబిజీగా రైతులు
- కొందరు నూర్పిడి చేసి పంట విక్రయానికి సిద్ధం!
- కొనుగోళ్లు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- ఆందోళనలో అన్నదాతలు



లోకేశ్వరంలో వద్ద ఎండబెట్టిన మక్కలు

లోకేశ్వరం: రైతులు వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నచోట సాగు చేయగా, ముందుస్తు నెల క్రితమే పంట చేతికి వచ్చింది. దీంతో రైతులు కోతల్లో బిజీగా ఉన్నారు. కొందరు నూర్పిడి చేసి మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, ప్రభుత్వం ఈసారి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

కొందరికి మోదం..మరికొందరికి ఖేదం

జిల్లాలో 15,371 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. సోయాకు తెగులు సోకితే దిగుబడి రాదనే రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల పంటను కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం పంట కోతల్లో బిజీ అవుతున్నారు. వర్షం కురవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఈ వానలు కొందరికి మోదం..మరికొందరికి ఖేదంలా ఉంది.

రోజురోజుకు ధర తగ్గుముఖం

ప్రభుత్వం గత రబీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. అప్పుడు క్వింటాల్ మద్దతు ధర కన్నా దళారులు ఎక్కువ ధరకు కొనుగోళ్లు చేశారు. కాగా, ప్రస్తుతం రోజురోజుకు మక్కల ధర తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా మద్దతు ధర మించి అమ్ముడైన పంట ఈసారి తక్కువ ధర పలుకుతోంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు దిగుబడి బాగా వచ్చింది. కాని గడిచిన వారంలో క్వింటాల్ ధర తగ్గింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక గత్యంతరం లేక తక్కువ ధరకు విక్రయిస్తూ రైతులు నష్టపోతున్నారు.

అమ్ముదామంటే ఇబ్బందులు



మొక్కజొన్న పండించి అమ్ముదామంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దళారులు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు కొనుగొళ్ల ఊసే లేకపోడంతో దళారులకు అమ్ముకుంటున్నాం.

– నాగేష్, నగర్‌తండా

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి



పంట చేతికొచ్చి రోజులవుతుంది. కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు. ఇప్పటికైన మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులు లేకుండా చూడాలి.

– భూమేష్, రాయాపూర్‌కాండ్లీ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మొక్కజొన్న పంటలు ప్రస్తుతం కోత దశకు చేరుకున్నాయి. కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా రైతులు డిమాండ్ చేస్తున్నారు. కానీ కేంద్రాల ఏర్పాటుపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులకు మక్కల కొనుగోలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందిస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్, నిర్మల్

బతుకమ్మ సంబురాలు



మంజులాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌లో..



దిలావర్‌పూర్‌లో..

నిర్మల్‌ఖిల్లా/కడెం/లక్ష్మణచాంద/దిలావర్‌పూర్: బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో అంటూ జిల్లాకేంద్రం, కడెం మండలం అంబారిపేట్, లక్ష్మణచాంద మండలంలోని పలు గ్రామాలు, దిలావర్‌పూర్ మండలకేంద్రంలోని ఆయా వార్డుల్లో మహిళలు, యువతులు ఆడిపాడారు. సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కూడళ్ల వద్ద పెట్టి ఆడిపాడారు. జిల్లాకేంద్రంలోని మంజులాపూర్, శాంతినగర్ తదితర కాలనీల్లో చిన్నారులు, యువతులు, అందరూ సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. బతుకమ్మ చుట్టూ యువతులు నృత్యాలు చేశారు. అనంతరం మహిళలు పూలు సమర్పిస్తూ, 'వెళ్లిరా బతుకమ్మ అంటూ వీడ్కోలు పలికారు. పలుచోట్ల ఆలయ కోనేటి వద్ద నిమజ్జనం చేశారు.



కడెం మండలం అంబారిపేట్‌లో..

బహుమతులు అందజేత

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో సోమవారం బతుకమ్మల అలంకరణ కోసం నిర్వాహకులకు వీడీసీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. రెడ్డి సంఘం సభ్యులకు ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి నవనీత గ్రూప్ మహిళలకు రూ.2 వేలు, తృతీయ బహుమతి శ్రీరాంయూత్ శాలివాహన సంఘం మహిళా సభ్యులకు రూ.వెయ్యి ప్రైజ్‌మనీని అందించారు. సభ్యులు గంగారెడ్డి, ఉమేష్‌రెడ్డి, గ్రామస్తులు సుదర్శన్, నర్సారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతకు కృషి



మాట్లాడుతున్న సాగిడి హరికృష్ణ

సోన్: హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ కృషి చేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ నిర్మల్ నగర సహ బౌద్ధిక్ ప్రముఖ్ సాడిగే హరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గంజాల్ శాఖ ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలు, విభిన్న రంగాల్లో దేశభక్తిపూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాల్లో పనిచేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బైండ్ల సాయిలు, ఖండ కార్యవాహ ఆకారపు చిన్నయ్య , స్వయంసేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో పూజలు



దర్శించుకుంటున్న సిద్దేశ్వర మహారాజ్

బాసర: నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ కుటుంబ సమేతంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం పూజలు చేశారు. అనంతరం అర్చకులతో వారి కుమారుడు మైదాన్ని దత్తకు అక్షరాభ్యాసం పూజలు చేయించారు. సుభాష్ యాదవ్, రమేశ్‌రావు, శేఖర్‌రావు, రాజు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కడెంలో మాట్లాడుతున్న రితేశ్‌రాథోడ్

ఖానాపూర్/కడెం/మామడ/కడెం/పెంబి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ అన్నారు. ఖానాపూర్‌లోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘ భవనం, కడెం, పెంబిలో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఇటీవల ఎన్నికైన ఖానాపూర్ మండలానికి చెందిన ముగ్గురు జిల్లా కార్యవర్గంలో చోటుదక్కిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా మదిరె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గడ్డం రవీందర్ ఎన్నికకాగా, వీరిని అభినందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన కోండ్ర రాజారెడ్డిని బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్‌గా రమేశ్‌గౌడ్

కడెం: బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్‌గా మాసాయిపేట్‌కు చెందిన బుర్ర రమేశ్‌గౌడ్ సోమవారం నియమితులయ్యారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లు ధ్వంసం

మామడ: మండలంలోని తాండ్రలో అక్రమంగా తెల్లకల్లు విక్రయిస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రంగస్వామి తెలిపారు. గ్రామానికి చెందిన అజయ్‌గౌడ్ అనుమతి లేకుండా తెల్లకల్లు విక్రయిస్తుండగా పట్టుకుని 46 లీటర్ల తెల్లకల్లు ధ్వంసం చేశామన్నారు. సిబ్బంది వసంత్‌రావు,రషీద్‌ఖాన్, గౌతమ్, రవీందర్ ఉన్నారు.

నేటి నుంచి సదరం క్యాంపులు

నిర్మల్‌టౌన్: వైకల్య శాతం గుర్తించేందుకు మంగళవారం నుంచి నిర్వహించే సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 7 నుంచి 30 వరకు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంటి చూపు, ఆర్థోపెడిక్, వినికిడి లోపం ఉన్నవారు మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. మొబైల్‌కు సమాచారం వచ్చిన వారు ఆయా తేదీల్లో ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని తెలిపారు.

మండలానికి చేరిన కానుకలు

దిలావర్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం అక్కా చెల్లెళ్లకు అందించే దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలకు సంబంధించి అందించే చీరలు సోమవారం మండల కేంద్రానికి చేరాయి. ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మీ రేవంతన్న కానుక పేరిట వీటిని పంపిణీ చేస్తామని ఐకేపీ ఏపీఎం బోస్ తెలిపారు. మండలంలోని 12 పంచాయతీ పరిధి గ్రామాల్లో అక్కాచెల్లెళ్లకు 8,810 చీరలు అందుబాటులో ఉన్నాయి.

మత్స్యకార సంఘానికి భూమి కేటాయించాలి

దస్తురాబాద్: మండల కేంద్రంలో మత్స్యకార సంఘానికి భూమి కేటాయించాలని కోరుతూ సోమవారం సంఘ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్‌కి సోమవారం వినతిపత్రం అందించారు. గంగన్న, రాకేశ్, శంకర్, భీమన్న, రాజు, నర్సయ్య ఉన్నారు.

మహిళా రైతు సంఘాల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే రామారావుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

ముధోల్: మహిళా రైతు సంఘాలు బలోపేతానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ముధోల్‌లోని రైతు వేదికలో సోమవారం మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వితీయ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంపై సంఘాలు అవగాహన పెంచుకోవాలన్నారు. దీంతో 2023–24 సంవత్సర ప్రణాళికను చదివి వినిపించారు. 2025–26 సంవత్సర బడ్జెట్‌ను అమోదం తీర్మానించారు. అనంతరం మహిళా రైతు సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల చైర్‌పర్సన్ ధర్మపురి వినోద, బోర్డు డైరెక్టర్లు మురళి, ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, సీఈవో సాయినాథ్, ఆయా మండలాల మహిళా రైతు సంఘ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మించాలి

లోకేశ్వరం: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని పోట్‌పల్లి(బి) గ్రామంలో పోచమ్మ ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ కూలిందని, దీన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం భైంసాలోని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. లక్ష్మణ్ జాదవ్, చిన్న సాయన్న, గణేశ్, నరేందర్, మారుతి, సాయిరాం, నరసయ్య, భోజన్న, వీడీసీ సభ్యులు ఉన్నారు.

నగదు రహిత లావాదేవీలపై శిక్షణ



శిక్షణ పొందిన సభ్యులు

నిర్మల్ రూరల్: మండలంలోని ముఠాపూర్ గ్రామంలో గ్రామ సమైఖ్య సభ్యులకు నగదు రహిత లావాదేవీలపై అధికారులు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఆర్పీలు దీపిక, అరుణ నగదు రహిత లావాదేవీలతో కలిగే లాభాలను వివరించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ముఠాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశారన్నారు. ఇప్పటికే మండలం నుంచి ముగ్గురు సీఆర్పీలను హైదరాబాద్ పంపించి ఐదు రోజులు శిక్షణ ఇచ్చారని పేర్కొన్నారు. సంఘం సభ్యులు బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు నగదు రూపంలో చెల్లించకుండా నగదు రహిత రూపంలో చెల్లించాలని సూచించారు. ఫోన్‌పే, గూగుల్‌పే చెల్లించేలా అవగాహన కల్పించారు. ఇందులో సీసీ నర్సయ్య, వీవోఏ రాణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన పంటలు



ధర్మోరలో నేలవాలిన వరి పంట



సోయాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

లోకేశ్వరం/బాసర/ముధోల్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు భారీ వర్షానికి తడిసిపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన వానకు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల వద్ద ఆరబోసిన సోయా తడిసింది. లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, సోయా, వరి పంటలు దెబ్బతిని నేలవాలింది. బాసర మండలంలోని గ్రామాల్లో వేల ఎకరాల్లో సోయా, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఇంటి వద్ద, కల్లాల వద్ద ఆరబోసిన సోయా తడిసింది. ముధోల్ మండలంలోని గ్రామాల్లో ఆరబోసిన సోయా పంటలు తడిసి ముద్దయ్యాయి. అకాల వర్షానికి నష్టపోయిన పంటకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అండగా ఉంటా

ముధోల్: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రామరావు పాటేల్ అన్నారు. ముధోల్‌లోని కల్లాల వద్ద తడిసిన సోయా పంటను సోమవారం పరిశీలించారు. నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అసెంబ్లీలో సైతం మాట్లాడుతానన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గంట శ్రీనివాస్, సపటోళ్ల పోతన్న, జీవన్, మోహన్‌యాదవ్, బత్తినోళ్ల సాయి, బాలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్, నరేష్, దర్బార్ ఉన్నారు.



తడిసిన మక్కలను చూసుతున్న రైతు



ముధోల్: తడిసిన పంటను చూపుతున్న రైతు



కడెం ప్రాజెక్ట్ నుంచి రెండు వరద గేట్ల ద్వారా దిగువకు వస్తున్న వరద



స్వర్ణ ప్రాజెక్టు ఒకగేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

కడెం/భైంసాటౌన్/సారంగాపూర్: జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో జిల్లాలోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణ ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. కడెం ప్రాజెక్టుకు సోమవారం 10,337 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు రెండు వరద గేట్లు ఎత్తి 13,494 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ప్రాజెక్ట్ అధికారులు మూడు గేట్లు ఎత్తి 22,681 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సారంగపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి 1,100 క్యూసెక్కుల వరద రావడంతో అంతే మొత్తంలో నీటిని దిగువకు వదులుతున్నారు.

రేపు ఉచిత హోమియో వైద్యశిబిరం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలోని గురడి రెడ్డి కాపు సంఘ కల్యాణ మంటపంలో బుధవారం ఉచిత మెగా హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నారాయణరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ హోమియో కళాశాల రామాంతాపూర్ వైద్యసిబ్బంది పాల్గొని చికిత్స అందజేస్తారని తెలిపారు. వయో వృద్ధులకు సంబంధించి కీళ్లనొప్పులు, ఇతర సమస్యలు, మధుమేహం, రక్తపోటు తదితర వాటికి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.